జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
ఆదివారం | 22 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 11



8

## యూరియా వాడకంపై రైతులు అపోహలు వీడాలి




### తెలంగాణలో ఊరూరా

# బెల్టు జోరు

### గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై ఆందోళన

గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఊరూరా బెల్టు జోరు" అనే పరిస్థితి నెలకొన్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



2

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

# 'రైటర్ల' రాజ్యం

సామాన్యుడి జేబుకు చిల్లు!
నిబంధనలు గాలికి
వసూళ్లే లక్ష్యం
నిజనిర్ధారణ ఎక్కడ?
సామాన్య గోడు పట్టదా?



11

# పచ్చని పందిరిలో కత్తుల వీరంగం



### పాత కక్షలతో రక్తసిక్తమైన వివాహ వేడుక
### బంధువుల పెళ్ళికి హాజరైన బావపై బామ్మర్ది కత్తితో దాడి
### అడ్డుకోబోయిన అన్న మృతి

**రామగిరి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి) :** పండుగలా మొదలైన పెళ్లి వేడుక క్షణాల్లో విషాదంగా మారింది. బంధువుల మధ్య నవ్వులు వినిపించాల్సిన చోట కేకలు మార్మోగాయి. పాత కక్షల అగ్ని, ఒక కుటుంబాన్ని శాశ్వతంగా చీకటిలోకి నెట్టింది. పెళ్లికి వెళ్లిన వ్యక్తి, తిరిగి ఇంటికి చేరకుండానే మృత్యువు ఒడిలోకి చేరుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బేగంపేటకు చెందిన మొలుగూరి

..మిగతా 2లో

## మైనారిటీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

### దరఖాస్తులకు మార్చి1 వరకు గడువు

**కొడిమ్యాల, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న సబ్సిడీ రుణ పథకాల కోసం కొడిమ్యాల మండలంలోని అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 21 నుంచి మార్చి 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. తుర్క కాశా ముస్లిం వర్గానికి రూ.60 వేల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ కింద టూల్‌కిట్, జనరేటర్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు 21--55 ఏళ్ల వయస్సు కలిగి కమ్యూనిటీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, ఫోటో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నాన్ ముస్లిం మైనారిటీ యువతకు రూ.1.50 లక్షల యూనిట్‌కు 80 శాతం సబ్సిడీతో పైలట్ ప్రాజెక్ట్ కింద ఈ-స్కూటర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 21--40 ఏళ్ల వయస్సుతో కులం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, 10వ తరగతి పాస్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతా ల్లో రూ.2 లక్షలు వార్షిక ఆదాయం మించని వారు అర్హులని తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం పొందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**కథలాపూర్, ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి):**

మండలంలోని ఊట్పల్లి గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లలేని పేద కుటుంబాలకు గృహ నిర్మాణ సహాయం అందించి వేలాది కుటుంబాలకు ఆశ్రయం కల్పించిన పథకం ఇదేనని ప్రతి కుటుంబానికి సురక్షిత నివాసం కల్పించడమే పథకం లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజీమ్, సీనియర్ నాయకులు చెదలు సత్యనారాయణ, వాకిటి రాజిరెడ్డి, సర్పంచ్ పాల లక్ష్మీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తొంబరావుపేట

## శివాలయానికి రేకుల షెడ్డుకు విరాళం

**మేడిపల్లి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)**

మేడిపల్లి మండలం తొంబరావుపేట గ్రామంలోని శివాలయం ఆలయంలో రేకుల షెడ్డుకు దొసిలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి రూ.25 వేయ్యలు విరాళంగా అందజేశారు. స్థానిక నాయకులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులకు ఈ విరాళాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి గారిని సాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిట్టెడి గంగాధర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి శేఖర్ రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం జలంధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీపతి దామోదర్, మిట్టపల్లి సాయి రెడ్డి, మామిడి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో ఊరూరా బెల్టు జోరు

## గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై ఆందోళన

**ముస్తాబాద్, ఫిబ్రవరి 21 ( ప్రజా జ్యోతి ):**

మండలంతో పాటు పలు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఊరూరా బెల్టు జోరు" అనే పరిస్థితి నెలకొన్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న



బెల్టు దుకాణాలు గ్రామాల మధ్యలోనే నిర్వహి స్తున్నట్లు సమాచారం. స్థానిక మహిళలకు ఇబ్బం దులు బీఆర్ఎస్ నాయకురాలు కుర్ర సావిత్రి సాయంత్రం అయ్యే సరికి గ్రామాల్లో యువత, కూలీలు బెల్టు దుకాణాల వద్ద గుమిగూడు తున్నారని, దీనివల్ల కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకురాలు కుర్ర సావిత్రి అన్నారు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, దేవాలయాల సమీపంలో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి ఉన్న దుకాణాల నుంచి మద్యం రహస్యంగా గ్రామాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామాల్లో శాంతి భద్రతలు దెబ్బతింటున్నాయని, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

### కఠిన చర్యలు తీసుకుంటాం



ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ప్రత్యేక దళాలతో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# నిరుద్యోగ యువత టాస్క్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ఫిబ్రవరి 28లోపు ఉచిత శిక్షణకు నమోదు చేసుకోవాలని సూచన

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను పొందేందుకు పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్ అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలు పెంచే లక్ష్యంతో టాస్క్ రీజనల్



సెంటర్ ఆధ్వర్యంలో పలు టెక్నికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్ డిపో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జావా వెబ్ డెవలప్‌మెంట్, పైథాన్, సీ, సీంం, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, టాలీ విత్ జీఎస్టీ, మెడికల్ కోడింగ్ ఒ బిల్లింగ్‌తో పాటు ఆప్టిట్యూడ్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. టాస్క్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రైవేట్ రంగంలో మంచి వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 28లోపు టాస్క్ సెంటర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90595 06807 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు.

# పచ్చని పందిరిలో కత్తుల వీరంగం

**మొదటి పేజీ తరువాయి...**

కొమురయ్య తన భార్య లక్ష్మి, బంధువులతో కలిసి సెంటినరీ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యాడు. అదే వేడుకకు సుల్తానాబాద్ మండలం నారాయణరావుపేటకు చెందిన తన సోదరుడు మొలుగూరి సత్తయ్య కూడా వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో కొమురయ్య, సత్తయ్యలు ఇద్దరూ ఫంక్షన్ హాల్ బయటకు వెళ్లగా, మొలుగూరి సత్తయ్యకు స్వయాన బావమరిది అయిన బుర్ర రాజా కొమురయ్య కత్తి పట్టుకుని వెనుక నుంచి సత్తయ్యపై దాడి చేయగా, అతను చేతితో అడ్డుకోవడంతో కుడి చేతిపై మూడు చోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి. అడ్డుకోబోయిన సత్తయ్య అన్నయ్య కొమురయ్యపై ఎడమ ఛాతీ భాగంలో కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఘటనను గమనించిన స్థానికుడు దాసరి శివ వెంటనే రామగిరి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని గాయపడిన కొమురయ్యను పోలీసు వాహనంలో సెంటినరీ కాలనీ డిస్పెన్సరీకి తరలించగా చికిత్స చేస్తుండగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మృతుడి భార్య మొలుగూరి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగిరి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

### పాత కక్షతోనే.. :

2011లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు మృతి చెందిన ఘటనలో మొలుగూరి కొమురయ్య, మొలుగూరి సత్తయ్యలు కారణమని అనుమానంతో చాలా కాలంగా కక్ష పెంచుకున్న బుర్ర. రాజాకొమురయ్య అప్పటి నుంచి వారిని



చంపుతానని పలుమార్లు బెదిరించినట్లు మొలుగూరి కొమురయ్య భార్య లక్ష్మీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో బేగంపేట ని వదిలి వెళ్ళిన మొలుగూరి సత్తయ్య శనివారం సెంటినరీ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న సమీప బంధువు వివాహ వేడుకకు వచ్చినట్లు తెలుసుకున్న రాజా కొమురయ్య మాటు వేసి మరి ఇరువురిపై కత్తితో దాడికి పాల్పడి, మొలుగూరి కొమురయ్యను తీవ్రంగా గాయపరచగా మృతి చెందినట్లు తెలిపారు.

# పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

## మేడిపల్లి మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

**మేడిపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**



పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మేడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు తోడ్పడే లక్ష్యంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పెళ్లి ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, ఉచిత విద్యుత్ సరఫరా, పంటల బీమా వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో సుమారు 45 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని మండల వ్యాప్తంగా 400 పై చిలుకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని వాటి నిర్మాణం శరవేగంగా జరుగుతుందని తెలిపారు. మొన్నటి రోజున ప్రభుత్వం బేస్మెంట్ లెవల్లో నిర్మాణం అయిన ఇండ్లకు వెసులుబాటు కల్పించిందని ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగు తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, బహుళజాతి సంస్థల ప్రతినిధుల తో గ్లోబల్ సమ్మిట్‌లోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో ఐటీ, ఔషధ తయారీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, తయారీ రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు పలు అవగాహన ఒప్పందాలు (మౌస్ ) కుదుర్చారని తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు సమ్మిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతాయని రాష్ట్రాన్ని దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్య స్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మేడిపల్లి మండల ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో మేడిపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మునీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ కుమార్, మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, పాల్గొన్నారు.

# దమ్మన్నపేటలో ఉచిత వైద్య శిబిరం



**గంభీరావుపేట, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో దమ్మన్నపేటలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నాలుగో రోజులో భాగంగా ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పాక ధర్మపురి ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ వారి సౌజన్యంతో శనివారం ఈరోజు దమ్మన్నపేట గ్రామ ప్రజలకు మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ దుంపల చంద్రశేఖర్ రెడ్డి గారి సమక్షంలో ప్రారంభించడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రతిమ ఫౌండేషన్ వారు జనరల్ మెడిసిన్- డాక్టర్ శ్రీకర్, జనరల్ సర్జన్- డాక్టర్. కే నవ్య, ఆప్తమాలజీ- డాక్టర్. శివాని, ఎముకలకు మరియు కీళ్లనొప్పులకు- డాక్టర్. వరుణ్, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు- డాక్టర్. తేజశ్రీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న గ్రామ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు సుమారు 250 మందికిపైగా వైద్య సేవలు నిర్వహించి, ఉచిత మందుల పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ గారికి, ప్రతిమ ఫౌండేషన్ వారికి గ్రామ సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి అమిత్ ఫాషా, ప్రతి మా ఫౌండేషన్ మేనేజర్ వంగ గీతారెడ్డి పాల్గొన్నారు.



# నాగారంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

**కోనరావుపేట: ఫిబ్రవరి.21(ప్రజా జ్యోతి)**

కొనరావుపేట మండలం నాగారం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దేశెట్టి మల్లేశం ,అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారూ. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాస్థాయి మెరుగుపరచడం క్రమశిక్షణ పెంపొందించడం, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం అంటే అంశాలపై చర్చించారు ప్రతి విద్యార్థి యొక్క చదువు ప్రవర్తన మరియు హాజరు వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు అలాగే ఇంటి వద్ద పిల్లలు పాఠాలను పునరావృతం చేయడానికి తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు అనంతరం సర్పంచ్ అప్పల నాగభూషణం ,హాజరై విద్యార్థులకు పలు సూచనలు తెలియజేస్తూ ఐడి కార్డులు విద్యార్థులకు పంపిణీ చేశారు.




# నీటి ఎద్దడి నివారణకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్

**ముస్తాబాద్, ఫిబ్రవరి 21 ( ప్రజా జ్యోతి):**

గ్రామంలో నీటి ఎద్దడి సమస్యలను ముందస్తుగా గుర్తించి పరిష్కరించేందుకు ఈరోజు సమ్మర్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గ్రామంలోని గల్లి గల్లీ తిరిగి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త లైన్ల ఏర్పాటు అవసరమైన ప్రాంతాలను గుర్తించడంతో పాటు, పైపులైన్లలో ఉన్న లీకేజీలను సరి చేయడానికి చర్యలు ప్రారంభించారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని, వెంటనే పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిగురు నరేష్, గ్రామ కార్యదర్శి నవ్య, డీఈ పావని, ఏఈ దివ్య, వాటర్ మేన్ కారోబార్ సాయి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ప్రజలు కోరగా, అధికారులు త్వరితగతిన పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.



# రాచర్ల బొప్పాపూర్ నుంచి పశ్చిమబెంగాల్ వరకు విజయ యాత్ర

### జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడలకు డీ శృతిక ఎంపిక

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**




ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న డి శృతిక తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్ 16 బాలికల వాలీబాల్ విభాగంలో అత్యంత ప్రతిభ ప్రతిభా కనబరిచిన క్రీడాకారుని ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామంలో జరిగినటువంటి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో నుంచి జాతీయ స్థాయికి ఎంపిక జరిగింది వారు ఈనెల 24 నుంచి మార్చ్ ఒకటి వరకు పశ్చిమ బెంగాల్ లో జరిగే పోటీలకు ఎన్నికైనట్టు పాఠశాల ఫిజికల్ అక్బర్ తెలిపారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు మధుమాలతి విద్యార్థి సృతికలు అభినందించారు.

# ఎల్లారెడ్డిపేటలో మేకల గొర్రె ల అంగడిని ప్రారంభించిన సర్పంచ్



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాల సాధు వెంకటరెడ్డి ఐటిఐ కళాశాల పక్క గల కాళీ మైదానంలో శనివారం రోజున ఎల్లారెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఆధ్వర్యంలో మేకల గొర్రెల అంగడిని ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల వారు ఈ సంతని వినియోగించుకోవాల్సిందిగా సర్పంచి పాలకవర్గము విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కుల సంఘాల అధ్యక్షులు పాలకవర్గం పాల్గొన్నారు.

# లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

**రాయికల్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి).**



రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆదివారం రోజు నక్కలగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం మహా అన్నదానం రథోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సౌజన్యంతో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని అర్చకులు వెంకట కృష్ణ తెలిపారు. ఆదివారం రోజున జరిగే శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం, మహా అన్నదాన కార్యక్రమం,రథోత్సవ కార్యక్రమాలకి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకి పాత్రులు కాగలరని నిర్వాహకులు గ్రామ పంచాయతీ పాలకవర్గం వారు కోరారు. వీరు మాట్లాడుతూ యాచమనేని గంగారావు -రాధమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన వితరణకి, బహ్మోత్సవాలు మొదలైన రోజు నుండి భక్తులకి యువ మిత్ర యూత్ వారు త్రాగు నీరు అందించారని తెలిపారు. వీరికి గ్రామ పాలక వర్గం తరుపున, గ్రామ ప్రజల తరుపున సర్పంచ్ గుర్రం మహేందర్ -భావన, ఉప సర్పంచ్ మూగల సంజీవ చారి కృతజ్ఞతలు తెలిపారు.



# గీత కార్మికుడికి ఆర్థిక సాయం



చొప్పదండి, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):

చొప్పదండి పట్టణ కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పోతిగంటి ఎల్లయ్య గౌడ్ ఇటీవల తాటి చెట్టు పై నుండి కింద పడి తీవ్ర గాయాలై కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం గౌడ యువజన సంఘం తరుపున వారిని పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గౌడ యువజన సంఘం అధ్యక్షుడు బొడిగే గంగరాజు గౌడ్, బత్తిని ప్రశాంత్ గౌడ్, పూదరి మధు గౌడ్, బోడిగే శేఖర్ గౌడ్ , బోడిగే సాయికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో పటిష్ట భద్రత ఏర్పాట్లు: జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే



గంభీరావుపేట ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):

గంభీరవుపేట మండలంలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల బృందం ఆదివారం రోజున పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.పర్యటన దృష్ట్యా గంభీరవుపేట మండలంలో ఏర్పాట్లను,హెలిప్యాడ్ ను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోపరిశీలించి,అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ అనిల్ పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మణికంఠ రెడ్డి ఎన్నిక.

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 21( ప్రజాజ్యోతి )



అఖిల భారత విద్యార్థి సమాఖ్య. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 18 నుండి 20 వరకు జరిగాయి. ఈ మహాసభల్లో రాష్ట్ర నూతన కౌన్సిల్ సభ్యుల ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవ సారి(మరోసారి)కరీంనగర్ నగరానికి చెందిన కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు.2011 లో ఏఐఎస్ఎఫ్ లో చేరిన మణికంఠ రెడ్డి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా,నగర కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శిగా పని చేసి 2022లో కొత్తగూడెంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 3 రాష్ట్ర మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై, తిరిగి నిజామాబాద్ లో జరిగిన నాలుగో రాష్ట్ర మహాసభలో రెండవసారి రాష్ట్ర అధ్యక్షుడిగా మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు. విద్యారంగంలో ఉన్న సమస్యలపై,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడంలో మణికంఠ రెడ్డి ముందుంటున్నారని జాతీయ,రాష్ట్ర నాయకత్వం గుర్తించి తిరిగి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఏఐఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని,మరింత బాధ్యతతో ఉద్యమాలు నిర్వహిస్తానని మణికంఠ రెడ్డి తెలిపారు.

# అంబరాన్నంటిన "స్మృతి సౌరభం" వీడ్కోలు సంబరాలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి )




స్థానిక నగరం లోని మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమము 'స్మృతి సౌరభం' అనే పేరుతో నిర్వహించారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ విద్యార్థులను ప్రసంగిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. గత పదకొండు సంవత్సరాలుగా పారమితలో విద్యనభ్యసించిన విద్యార్థులు, కేవలం మార్కుల కోసమే కాకుండా, నైతిక విలువలు, స్వీయ క్రమశిక్షణ మరియు ఆత్మనియంత్రణ వంటి గొప్ప లక్షణాలను అలవర్చుకున్నారని ఆయన కొనియాడారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విలువలనే ఆయుధా లుగా చేసుకుని సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ కాలం పాటు ఒకే గొడుగు కింద పెరిగిన విద్యార్థులు, తమ పాఠశాల విద్యాభ్యాసాన్ని ముగించుకుని వెళ్తున్న తరుణంలో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలకు తోడ్పడిన ఉపాధ్యాయ మరియు ఉపాధ్యా యేతర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. రాబోయే బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలతో తల్లిదండ్రులకు మరియు పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని చిన్నారు లకు మార్గనిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల బోధన, వారి మార్గదర్శకత్వం తమ జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోతాయని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాబోయే బోర్డు పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ వీడ్కోలు వేడుక కేవలం భావోద్వేగాల తోనే కాకుండా, విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో సందడిగా సాగింది. తమ సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా: ఇనుగంటి ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, వినోద్ రావు, రాకేష్, అనూకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత ప్రసాద్ సమన్వయ కర్త శ్రీనాథ్, మాళవిక, సరిత, లావణ్య, పాల్గొన్నారు.





# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):





అక్రమ ఇసుక రవాణాపై బొమ్మకల్ గ్రామ పరిధిలోని రాజీవ్ రహదారిపై శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరుగురిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కన్నం అనిల్,బండారి రాజు,వడ్లకొండ రాజు,సిలివేరు శ్రీకాంత్, తీట్ల అనిల్,ఆరెల్లి సాయి కుమార్,దర్శనాల లక్ష్మణ్‌లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ విజిలెన్స్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు,ఈ ఘటనపై విజిలెన్స్ ఇన్స్పెక్టర్ వరుణ్ ప్రసాద్ కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసి, అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం నిందితులను తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎవరినీ వదలబోమని, ఇటువంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# బహుజన ఆశయాలకు వారధిగా డా. మార్షల్ దుర్గం నగేష్

ఎన్టిపిసి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):



సామాజిక సమానత్వ సాధనకు అంకిత భావంతో పనిచేస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న బహుజన నాయకుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ సేవా ప్రస్థానం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. నినాదాలకే పరిమితం కాకుండా సేవ, చైతన్యం, ఉద్యమాలను సమన్వయం చేస్తూ సమాజ మార్పు దిశగా కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అదే సమయంలో సమత ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు విద్య, వైద్య, ఆర్థిక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలను విస్తరించారు.

## విద్య ద్వారానే సాధికారత లక్ష్యం

సామాజిక మార్పుకు విద్యే ప్రధాన ఆయుధమనే భావనతో స్వంత వ్యయంతో స్థాపించిన సమత గ్రంథాలయం ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు మార్గదర్శనం అందిస్తున్నారు. దళిత, బహుజన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సహాయం అందించడం విశేషం.

## దేశ, విదేశీ స్థాయిలో గుర్తింపు

సామాజిక సేవలకు గాను అంతర్జాతీయ స్థాయిలో కూడా డా. నగేష్ గుర్తింపు పొందారు. అమెరికాలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం ప్రదానం చేసిన 'దళిత సేవారత్న' పురస్కారం ఆయన సేవలకు నిదర్శనంగా నిలిచింది. దళిత సాహిత్య అకాడమీ, మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డు సహా పలు జాతీయ, సామాజిక సంస్థల నుంచి సత్కారాలు అందుకున్నారు.

## ఉద్యమం సేవ జ్ఞానం సమన్వయం

సమాజంలో చైతన్యం కల్పించేందుకు ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు, విద్యా ప్రోత్సాహం అనే మూడు రంగాల్లో సమాంతరంగా పనిచేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పిస్తూ సామాజిక ఐక్యతకు కృషి చేస్తున్నారు.

స్ఫూర్తిదాయక ప్రయాణం

సామాన్య కుటుంబం నుంచి ఎదిగి సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో కొనసాగుతున్న డా. మార్షల్ దుర్గం నగేష్ ప్రస్థానం బహుజన వర్గాలకు ప్రేరణగా మారింది. సేవను బాధ్యతగా భావిస్తూ కొనసాగుతున్న ఆయన ప్రయాణం సమానత్వ సమాజ నిర్మాణానికి దోహదపడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్‌గా జి.ఎస్. ఆనంద్

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21( ప్రజాజ్యోతి )**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా కరీంనగర్ పట్టణానికి చెందిన జి.ఎస్. ఆనంద్‌ను నియమిస్తున్నట్లు ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో విశేష సేవలు అందించిన ఉద్యమకారులను సంఘటితం చేసి వారి హక్కుల సాధన కోసం ఫోరం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.జి.ఎస్. ఆనంద్ గత రెండు దశాబ్దాలకు పైగా తెలంగాణ ఉద్యమంలో సక్రియ పాత్ర పోషిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంగా "తెలంగాణ చౌక్" ఏర్పాటు చేసి అనేక నిరసనలు, దీక్షలు, ర్యాలీలు, చర్చా వేదికలు నిర్వహించారు. రాష్ట్ర సాధనలో కీలక దశల్లో ఉద్యమకారులను సమీకరించి ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించి నట్లు రాష్ట్ర కమిటీ ప్రశంసించింది.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా అనేక మంది ఉద్యమకారుల



సేవలు తగిన రీతిలో గుర్తింపుపొందలేదని, వారికి సరైన సంక్షేమ పథకాలు అమలుకాలేదని ఫోరం అభిప్రాయపడింది.ఈ నేపథ్యంలో ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ, గౌరవం మరియు సంక్షేమం కోసం సమగ్ర కార్యా చరణ చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. జి.ఎస్. ఆనంద్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న అన్ని ఉద్యమకారులను ఏకం చేసి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ముఖ్యంగా ఉద్యమ సమయంలో నమోదైన పోలీసు కేసులను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని, ప్రతి అర్హుడైన ఉద్యమకారునికి రెండు గుంటల భూమి కేటాయించాలని, అలాగే ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా జిల్లాలో మండల, పట్టణ, గ్రామ స్థాయిలో ఫోరం కమిటీలను బలోపేతం చేసి ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే విస్తృత సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఫోరం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులకు, సీనియర్ ఉద్యమకారులకు మరియు కార్యకర్తలకు జి.ఎస్. ఆనంద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ బాధ్యతను ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.

# పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కేబుల్ ఆపరేటర్ల హవా

## వృత్తి నుంచి ప్రజాప్రతినిధులుగా ఎదిగిన ఇద్దరు నేతలు



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

దశాబ్దాలుగా కేబుల్ ఆపరేటర్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి ఈసారి మున్సిపల్ ఎన్నికలు అదృష్టాన్ని తెచ్చిపెట్టాయి. వార్డు రిజర్వేషన్లు అనుకూలించడంతో ఎన్నికల బరిలో నిలిచిన కేబుల్ ఆపరేటర్లు విజయం సాధించి ప్రజాప్రతినిధులుగా అవతరించారు. పెద్దపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో 24వ వార్డు నుంచి సిటీ కేబుల్ ఎండీగా పనిచేస్తున్న కొట్టే స్వరూప సదానందం కౌన్సిలర్‌గా గెలుపొందగా, 21వ వార్డు నుంచి పోటీ చేసిన నుగిళ్ళ మల్ల య్య మున్సిపల్ చైర్మన్ పదవిని అధిరోహించడం విశేషంగా మారింది. సాధా రణ కేబుల్ వృత్తితో ప్రారంభించి అంచెలం చెలుగా ఎదిగి ప్రజల మద్దతుతో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పట్టణంలోని కేబుల్ ఆపరేటర్లలో ఆనందం వ్యక్తమైంది. గెలుపొందిన మున్సిపల్ చైర్మన్ నుగిళ్ల మల్లయ్యతో పాటు కౌన్సిలర్ కొట్టే స్వరూప సదానందంను పట్టణ, గ్రామీణ కేబుల్ ఆపరేటర్లు ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు లైసెట్టి బిక్షపతి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే వృత్తిదారులకు ప్రజలు ఇచ్చిన గౌరవమే ఈ విజయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ, గ్రామీణ ప్రాంతాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# నీటి వనరుల సర్వే పూర్తి

## తహసిల్దార్ పుల్లూరి జగదీశ్వరరావు.

**కాల్వ శ్రీరాంపూర్. ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)**

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జల వనరుల సంఘం ఏడవ చిన్న సాగు నీటి వనరులలో భాగంగా చేపట్టిన సర్వే 99% పూ- ర్తయినట్లు తహసిల్దార్ పులులూరి జగదీశ్వర్ రావు శనివారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 రెవెన్యూ గ్రామాలలో 13 మంది గ్రామ పాలనాధికారులు. నలుగురు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు .మొ- ుత్తం 17 మంది సర్వే చేసినట్లు ఆయన తెలిపారు .ఇందులో 4 వేల 719 బావులు 121 చెరువులు .మొత్తం 4. వే ల8 వందల40 ఉన్నట్లు. ఆయన పేర్కొన్నారు. ఇందులో 4. వేల7 వందల40 సర్వే కాగా 100 చెరువులు. కుంటలు. సర్వే కొరకు .మిగిలి ఉన్నట్లు వివరించారు .అవి కూడా అతి త్వరలో. సర్వే పూర్తి చేయనున్నట్లు. ఆయన వివరించారు.



# విద్యార్థి సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి అవసరం



**పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):**

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులతో నిర్వహించిన ముఖ్య సమావేశంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకుడు పెర్క శ్యామ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సామాజిక న్యాయం, విద్యార్థుల సమస్యలు, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణ, యువత భవిష్యత్తు వంటి పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ కోసం అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.సామాజిక సమానత్వ సాధనలో విద్యార్థి ఉద్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగతో పాటు ఎంఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కౌన్సిలర్ జడల సురేందర్

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21, (ప్రజా జ్యోతి):**



పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా పెద్దపల్లి మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల సురేందర్ రాష్ట్ర సమాచార సాంకేతిక, మున్సిపల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా తీసుకుని ముందుకు సాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జడల సురేందర్‌ను అభినందించారు.

# వేములవాడ, చైర్మన్, వైస్ చైర్మన్ కు శుభాకాంక్షలు

**వేములవాడ, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్, నరాల.శేఖర్,మున్సిపల్ లో పదవీ బాధ్యతలుస్వీకరించిన సందర్భంగా బిజెపి పార్టీ కౌన్సిలర్ల తరపున, 26వవార్డ్,కౌన్సిలర్,మామిండ్లఅమర్శ- లక్ష్మీరాజం. శుభాకాంక్షలుతెలపడంజరిగింది. అభివృద్ధికి, బిజెపిపార్టీ, కౌన్సిలర్లు మావంతుసహాయం ఎల్లపుడుఅందిస్తాము, అని అన్నారు. ఈకార్యక్ర మంలో, వేములవాడ ఎమ్మెల్యే,విప్, ఆది.శ్రీనివాస్, బీజేపీ, జిల్లా, మాజీ అధ్యక్షులు,ప్రతాప.రామక్రిష్ణ,బీజేపీరాష్ట్రనాయకులు, కుమ్మరి. శంకర్(కౌన్సిలర్), వేములవాడ మున్సిపల్, కౌన్సిల్సభ్యులు, ,నాయకులుపాలుగోన్నారు..



# హాల్ టికెట్లు వెంటనే జారీ చేయాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):**

ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వెంటనే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విద్యార్థులకు జారీ చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డిమాండ్ చేశారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఇప్పటికే ఇంటర్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినప్పటికీ, కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఆపివేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 25, 26 తేదీల నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది విద్యార్థులు సిద్ధమవుతున్న సమయంలో ఈ చర్యలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని అన్నారు. ఇంటర్ బోర్డు హాల్ టికెట్లు కళాశాల లాగిన్‌లలో అందుబాటులో ఉండటంతో పాటు తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు పంపినప్పటికీ, కొన్ని కళాశాలలు వాటిని విద్యార్థులకు అందజేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల జిల్లాలోనే 300 మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయలేకపోతారనే ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు.ఫీజుల ఆలస్యం పేరుతో హాల్ టికెట్లు నిలిపివేయడం విద్యను వ్యాపారంగా మార్చే చర్యగా మారిందని విమర్శించారు. విద్యార్థులను బెదిరించే విధానాన్ని వెంటనే నిలిపివేసి అన్ని హాల్ టికెట్లను తక్షణమే అందజేయాలని కళాశాల యాజమాన్యాలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్మీడియట్ బోర్డు ఇలాంటి కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాల్ టికెట్లు




అందని విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించి పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపడతామని బండి రాజశేఖర్ హెచ్చరించారు. విద్య హక్కు తప్ప వ్యాపారం కాదని ఆయన స్పష్టం చేశారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయం

**సామ్రాజ్యవాద దురాగతాలను ఎండగట్టాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21( ప్రజాజ్యోతి )**

పెట్టుబడుదారి వ్యవస్థ అత్యున్నత వికృత రూపం దాల్చిందని సోషలిజమే పెట్టుబడుదారి వ్యవస్థకు ప్రత్యామ్నాయమని, అమెరికా సామ్రాజ్యవాదానికి దేశ ప్రయోజనాలను, మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతున్నదని సామ్రాజ్యవాద దురాగతాలను ప్రజలు ఎక్కడికక్కడ ఎండగట్టాలని, సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం రోజున ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 21న కమ్యూనిస్టు శ్రేణులు నిర్వహించుకునే రెడ్ బుక్ డేను జిల్లా కేంద్రంలో నీ ముకుంద లాల్ మిశ్రా భవన్లో రెడ్ బుక్ డే ను నిర్వహించారు.ఈ సందర్భంగా బరితెగించిన సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని పార్టీ నాయకులు సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఇజ్రాయిల్ ను ప్రోత్సహించి పాలస్తీనియన్లపై గత కొన్ని ఏళ్లుగా చేస్తున్న దాడులతో జరుగుతున్న మానవహననం ప్రతి ఒక్కరిని కదిలిస్తుందని, వెనుజులా దేశాధ్యక్షుడు మధురో తన భార్యను ఎత్తుకుపోయి నిర్బంధించడం, గతంలో ఇరాక్ పైన దాడి చేయడం, ఇప్పుడు ఇరాన్ పైన కాలు దువ్వడం లాంటి దుశ్చర్యలకు అమెరికా పాల్పడుతుందన్నారు. సామ్రాజ్యవాదులు అనేక దేశాల్లోని ప్రభుత్వాలు తమకు అడ్డం పడినప్పుడు వాటిని కూలదోసి ఆ స్థానంలో తమకు లొంగి ఉండే ప్రభుత్వాలను నెలకొల్పుతూ వచ్చారు. ప్రజాస్వామ్యం మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతి సూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించిన ఉదంతాలు కోకొల్లాలన్నారు. అది సమర్థించని నియంతలు లేరు. మరణకాండ లేదు. తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మధురో అపహరణ తర్వాత ట్రంప్ చెప్పారంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతామండలిలో ఒక శాశ్వత రాజ్యాంగ ఉండి మరో సర్వసత్తాక దేశ అధ్యక్షుడినీ కిడ్నాప్ చేసిందంటే ఐక్యరాజ్యసమితి ఉండి లేనట్లే నన్నారు. అమెరికా భాగస్వామ్యంగా ఉండి నెలకొల్పిన అనేక సంస్థలు అనివార్యమై తమకే అడ్డుపడుతుండడంతో క్రమంగా అమెరికా నాశనం చేస్తున్నదన్నారు. వెనుజులాను ఆక్రమించడం దాని బలహీనతకు తార్కానంగా కనిపిస్తుందన్నారు. ప్రపంచ దేశాలన్నింటినీ బెదిరిస్తూ తమ మాట వినకపోతే ఆదేశాలు పాటించకపోతే మదురోకు పట్టిన గతే పడుతుందని సందేశం ఇవ్వడం ఆందోళనకరమన్నారు. వెనుజులా పోరాటం కేవలం ఒక దేశం పోరాటం కాదనీ ఇది ప్రపంచ ప్రజల పోరాటం ఉన్నారు. చమురు కోసం కాదు, ఆత్మగౌరవం కోసం,ఒక వ్యక్తి కోసం కాదు, ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు కోసం అనేది గుర్తుంచుకోవాలన్నారు.. అమెరికా సామ్రాజ్యవాద శక్తులు ఆధిపత్యంతో గత 35 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ క్రమం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాత్వాన్ని దెబ్బతీసింది అన్నారు. . పెట్టబడుదారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నయం అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక అసమానతలు సహజంగానే పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగం పేదరికం పెరిగిందని, మరోపక్క కొంత మంది కార్పొరేట్ శక్తుల, పెట్టుబడుదారుల దగ్గర సంపద భారీగా పోగుబడిందని అన్నారు. సోషలిజం మాత్రమే ఆర్థిక అంతరాలు లేని సమాజాన్ని సృష్టించమని కమ్యూనిస్టు ప్రణాళిక పేర్కొన్నదని ఇది అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, సుంకర సంపత్, జి.రాజేశం,ఎడ్ల రమేష్, డి నరేష్, జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, కనకరాజు, ప్రభాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి చేయూత



**కొడిమ్యాల, ఫిబ్రవరి 21,(ప్రజాజ్యోతి):**

మండలం డబ్బుతిమ్మయపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి విజయ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందడం జరిగింది.ఆమె కుటుంబాన్ని ఏలేటి కమలాకర్ రెడ్డి పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయాన్ని శనివారం అందించారు. కార్యక్రమంలో సురకంటి ముత్యం రెడ్డి, మధు, సంజీవ్, సత్తయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**జిల్లా ఉద్యమకారుల ఉపాధ్యక్షుడు జనగామ రవి**



**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉద్యమకారులుగా పనిచేసిన వారికి ఇంటి స్థలంతో పాటు పెన్షన్ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ త్వరలో ప్రకటిస్తామని తెలపడం పట్ల తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఎంపీ గడ్డం వంశీకృష్ణ లకు శనివారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఅభినందనలు తెలిపారు.ఉద్యమకారులు ఉయ్యాల ఓదెలు. నల్లగొండిల్లా రాజేశం. తంగళ్ళపల్లి సతీష్. తిరుపతిరెడ్డి .కాసర్ల సాగర్ రెడ్డి బెజ్జాల ప్రభాకర్..తదితరులు ఉన్నారు.

## గ్రామీణ బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

**చొప్పదండి, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి జెడ్పిహెచ్ఎస్ ( బాలురు) 8వ తరగతి విద్యార్థులు హెచ్ఎం జలీల్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ముల్కల కుమార్, గోరంటాల పుష్పలత ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు ను శనివారం సందర్శించారు.బ్యాంకు మేనేజర్ ఎం.అనిల్ అకౌంట్ ల రకాలు-లాభాలు,డిపాజిట్ ల రకాలు-లభించే వడ్డీ,లోన్ లు రకాలు-వాటిపై చెల్లించే వడ్డీ లపై అవగాహన కల్పించారు. అపరిచితులకు ఓటీపీ,వ్యక్తిగత బ్యాంకు సమాచారాన్ని తెలప కూడద న్నారు. ప్రాసెసింగ్ అధికారి రమణారెడ్డి క్రెడిట్ ఓచర్,డెబిట్ ఓచర్,లోన్ వోచర్,ఆర్టిజిఎస్,నేఫ్ట్ వంటి పలు ప్రాఫార్మాలు నింపే విధానం వివరించారు.చెక్ బుక్,ఏటీఎం వాడటం వల్ల కలిగే సౌలభ్యాన్ని తెలిపారు.సోషల్ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల కుమార్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలపై ప్రత్యక్ష అనుభవాలను కల్పించేందుకై, విద్యార్థులు ఆన్లైన్ మోసాలకు గురికాకుండా నివారించేందుకై అవగాహన నిమిత్తం విద్యార్థులతో బ్యాంకును సందర్శించామన్నారు.క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో పరిశీలన,పరిశోధన, ప్రయోగాత్మక, వివరణాత్మక శైలి పెంపొందుతుందన్నారు.



## రోడ్డు విస్తరణపై గ్రామసభ



**కొడిమ్యాల, ఫిబ్రవరి 21,(ప్రజాజ్యోతి):**

మండలంలోని పూడూర్ గ్రామంలో శనివారం 563 నేషనల్ హైవే విస్తరణ పనులపై తహసీల్దార్ కిరణ్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైవే విస్తరణలో ఇండ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులతో మాట్లాడి నష్టపరిహారం గురించి చర్చించారు. ప్రజలు స్వచ్ఛందంగా సేకరణకు సంతకాలు చేస్తున్నారని తెలిపారు. సుమారు 150 మంది వరకు హైవే విస్తరణకు అనుకూలంగా సంతకాలు చేసినట్లు తెలిపారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు

**వైస్ చెర్మన్ కనికరపు రాకేష్**

**వేములవాడ, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**



వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక, ఉనికి కోసం పాకులాడుతున్న బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదమని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన ఆ పార్టీ నాయకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న రాజకీయం పట్ల ప్రజలు విసుగు చెందారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉన్న నాయకులు, ఏనాడో కాలం చెల్లిన పార్టీలో ఎలా ఉంటారని ప్రశ్నిస్తూ, ప్రజా క్షేత్రంలో ఉండి పని చేయాలనే ఉద్దేశంతోనే ఎందరో నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని, దీన్ని పార్టీ మార్పుగా కాకుండా ప్రజల వైపు వేసిన సామాజిక అడుగుగా చూడాలని రాకేష్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ల చేరికపై ఆ పార్టీ నేతలు చేస్తున్న రాద్ధాంతం వారిలోని ఆత్మన్యూనతా భావానికి, ఓటమి భయానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. దళితుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని, పదేళ్ల కాలంలో దళితులకు మీరు చేసిందేమిటి? మీరు నిర్మించిన దళిత గడపల నాణ్యత ఎంత? దీనిపై రాజన్న గుడి ముందే బహిరంగ చర్చకు సిద్ధమా? అని ఆయన పత్రిక ప్రకటనలో సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి మాయమయ్యే నాయకులను వేములవాడ ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, అందుకే మొన్నటి ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితం చేశారని గుర్తు చేశారు. వేములవాడ గల్లీ గల్లీ తెలిసిన నాయకులం మేము, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాముల మవుతుంటే.. కనీసం ఇక్కడి వార్డుల పేర్లు కూడా తెలియని వ్యక్తులను తెచ్చి ప్రెస్ మీట్లు పెట్టించడం బీఆర్ఎస్ రాజకీయ ఖాళీతనానికి పరాకాష్ట అని విమర్శించారు. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, బ్రిడ్జులు, డ్రైనేజీ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తోందని, ప్రజల్లో వస్తున్న మార్పే అభివృద్ధికి నిదర్శనమని రాకేష్ పేర్కొన్నారు. ప్రజల కడుపు నిండితే బీఆర్ఎస్ నాయకులకు కడుపులో మంట ఎందుకని, అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే మీకు సరైన బుద్ధి చెబుతారని, మాటలతో రాద్ధాంతాలు చేయడం కాదు.. అభివృద్ధి చేసే దమ్ముంటే నిరూపించు కోవాలని సవాల్ విసిరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత వేగంగా, వేములవాడను ఆదర్శవంతమైన పట్టణంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన వేడుకలు

## ఐదు రోజులపాటు ఉత్సవాలు నేడు విగ్రహ ప్రతిష్టాపన, పోచమ్మ కు మొక్కులు

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 21: (ప్రజా జ్యోతి)**

సుల్తానాబాద్ మండల పరిధిలోని నారాయణ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం ప్రతిష్టాపన వేడుకలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. గ్రామంలోని గౌడ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణాలు ఇటీవల పూర్తికావడంతో ఐదు రోజులపాటు ఘనంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణం ప్రత్యేకంగా అలంకరించబడగా, శనివారం ఉదయం పుణ్యాహవాచనం, గణపతి పూజ, యాగశాల కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రధాన కార్యక్రమంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన జరుగనుంది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అర్చకులు సంప్రదాయబద్ధంగా విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గౌడ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలతో మొక్కులు చెల్లించుకునే కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుంది. మహిళలు సాంప్రదాయ వేషధారణలో బోనాలు ఎత్తుకుని ఆలయానికి రానుండగా, గ్రామమంతా భక్తి వాతావరణంలో మునిగిపోనుంది. మంగళవారం గౌడ కులస్తులంతా ఏకమై ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్ర మాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, హారతులు, మంగళ వాయిద్యాలతో వేడుకలు కొనసాగనున్నాయి. గ్రామంలో ఎన్నో ఏళ్ల కల సాకారమై నూతన ఆలయం కొలువు తీరడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తిచేసిన గౌడ్ కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు అభినందించారు. శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు నారాయణపూర్ గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

# అంబరాన్ని అంటిన సంబరం

## మడిపెల్లి మల్లేష్ విజయం పై హర్షం



**ఎన్టిపిసి ,(ప్రజాజ్యోతి), ఫిబ్రవరి 21:**

ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన మడిపెల్లి మల్లేష్ సాధించిన విజయం స్థానికంగా అంబరాన్ని అంటిన సంబరాలకు దారితీసింది. మాస్ ప్రాంతానికి చెందిన సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన, పేదల సమస్యలను అర్థం చేసుకుని అన్నగా, తమ్ముడిగా, స్నేహితుడిగా ప్రజలతో మమేకమవుతూ విశేష ఆదరణ పొందినట్లు స్థానికులు తెలిపారు. కరోనా కాలంలో స్వంత ఖర్చులతో నిత్యావసర సరుకులు, వైద్య కిట్లు పంపిణీ చేసి అనేక కుటుంబాలకు అండగా నిలిచిన మల్లేష్ సేవలను ప్రజలు గుర్తుచేసుకున్నారు. ఎలాంటి విమర్శలు, అడ్డంకులు ఎదురైనా మౌనంగా సేవా మార్గంలో ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో సాధించిన ఈ విజయం సేవాభావానికి దక్కిన గౌరవమని అభిమానులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలో మరింత ప్రజాసేవ అందించాలని పలువురు ఆకాంక్షించారు.

# ఏఐడీఏసి జిల్లా అధ్యక్షుడిగా గౌరిశెట్టి రాజయ్య

**ముత్తారం,ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి)**

పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన గౌరీశెట్టి రాజయ్య ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయినట్లు రాష్ట్ర అధ్యక్షులు రత్నం శైలేందర్ తెలిపారు.ఈ సందర్భంగా గౌరీశెట్టి రాజయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు వెనుకబడిన కులాలకు అన్నీ వర్గాలకు ఇప్పటివరకు రిజర్వేషన్లు పొందని వారికి ప్రతి కులానికి రిజర్వేషన్లు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు రత్నం శైలేందర్ కి, జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిన్న రాము కి గౌరిశెట్టి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.



# కాషాయపు విజయంతో కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్

## భవిష్యత్తు అంతా బిజెపి దే

## బిజెపి ఉపాధ్యక్షులు శాంతి కుమార్

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి )**





తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ గడ్డపై తొలిసారిగా మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం శుభ పరిణామని , కరీంనగర్ గడ్డ నుండే రాష్ట్ర చరిత్రను మార్పు చేసే అనేక ఘటనలు జరిగాయని, కరీంనగర్ సెంటిమెంట్ ను ఎంతోమంది బలంగా విశ్వసిస్తారని, సెంటిమెంట్ గుబులు అన్ని పార్టీలకు మొదలైందని , చరిత్ర తిరగరాసే విధంగా బల్దియా పై కాషాయ జెండా ఎగరవేసిన బీజేపీ ఇక తిరుగు లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్ అన్నారు. శనివారం రోజున కరీంనగర్లోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్ లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కరీంనగర్ జిల్లా కార్యశాల ప్రోగ్రాం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకత మొదలైందని , రాష్ట్రం లో కాంగ్రెస్ పని అయిపోయిందని , భవిష్యత్తు అంతా బిజెపి దేనన్నారు.. ఉచితాలు, హామీలు, ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ గారడి చేసి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ పూర్తిగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని మరిచి సీఎం కూర్చిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. వచ్చేనెల జరగబోయే ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం అని చాటి చెప్పిన పార్టీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చూపెట్టిన మార్గంలో పార్టీ శ్రేణులు అందరూ నడవాలన్నారు. శిక్షణ లో అనేక విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని , ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రశిక్షణ ప్రోగ్రాం కు సంబంధించి పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు నిర్మలారెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంటు కన్వీనర్ , కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావ్ , ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు

# సైన్స్ ఎక్స్ పోలో ప్రతిభ కనబరిచిన గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నో స్పార్క్ 2కే26, జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంలో భాగంగా వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు తయారు చేసినటువంటి "స్మార్ట్ డస్ట్ బిన్ " అనే ప్రయోగానికి మూడవ బహుమతి రావడం జరిగింది. ఈ ప్రయోగంలో పాల్గొన్న విద్యార్థి విద్యార్థులను గీతాంజలి హైస్కూల్ కరెస్పాండెంట్ రేపాల రజిత, అకాడమిక్ డైరెక్టర్ రేపాల రోహిత్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాల సమావేశం



**తంగళ్ళపల్లి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

మండేపల్లి గ్రామంలోని యువజన సంఘాల సమావేశాన్ని గ్రామ సర్పంచ్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి జరగాలంటే యువజన సంఘాల పాత్ర కీలకమని తెలిపారు. గ్రామాభివృద్ధికి యువత సహకరించాలని యువత చదువుతోపాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.అనంతరం యువజన సంఘాల అభివృద్ధికి గ్రామంలోని సంఘ భవనాలు నిర్మించుకోవడానికి యువజన సంఘాలకు ఒక్కో సంఘానికి రెండు గంటల స్థలం కేటాయించాలని గ్రామపంచాయతీ సర్పంచ్ కార్యదర్శి కి వినతి పత్రం అందజేశారు.

# మహిళలు వారి హక్కులు వినియోగించుకోవాలి

**ధర్మారం, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

మండలలోని వివిధ గ్రామాల వార్డు సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధ్యర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సేవల గురించి వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏసి డిపిఓ సంపద కుమారి,జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త దయా అరుణ మాట్లాడుతూ మహిళలు వారి హక్కులు వినియోగించుకోవాలని అన్నారు. పుట్టబోయే బిడ్డ నుండి వృద్ధులకు అందుబాటులో ఉన్న సేవలు వాటి వినియోగం,బాలల హక్కులు, రక్షణ,మహిళ చట్టాలు,బాల్య వివాహాలు,లింగ నిరోధిక వ్యతిరేక చట్టం వంటి అంశాల పైన, గ్రామాలభివృద్ధి గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బాలల రక్షణ,సంరక్షణ సేవల గురించి 1098 సూపర్వైజర్ సంతోష్ వివరించారు.ఈ కార్యక్రమంలో ధర్మారం మండల అంగన్వాడీ సూపర్వైజర్లు బ్లాండినా,కె. భాగ్యలక్ష్మి,ఏపీవో రవి, అంగన్వాడీ టీచర్లు,ప్రకృతి ఎన్.జీ.ఓ సిబ్బంది,కాడ్రే ఎన్.జీ.ఓ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.



# పీఎంశ్రీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

## ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానం



**బీర్ పూర్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):**

బీర్ పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నాడు తల్లిదండ్రుల సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సుమారు 50 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రత్యేకంగా విద్యార్థుల ద్వారా ఆహ్వాన పత్రికలు పంపి తల్లిదండ్రులను ఆహ్వానించడం విశేషం. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతిరోజూ వారిని బడికి పంపాలని, తద్వారా 100 శాతం హాజరు సాధించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్.ఎల్.ఎన మరియు ఎఫ్.ఎల్.ఎస ర్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 'లో కాస్ట్ – నో కాస్ట్' పద్ధతిలో తయారు చేసిన బోధనా సామగ్రి టి.ఎల్.ఎమ్ ద్వారా విద్యార్థులకు పాఠాలను సులభంగా, నాణ్యంగా బోధిస్తున్నామని వివరించారు.

### సేంద్రియ కూరగాయలతో పౌష్టికాహారం:

పాఠశాల ఆవరణలో సేంద్రియ ఎరువుల సహాయంతో సాగు చేస్తున్న కిచెన్ గార్డెన్ గురించి ఆయన ప్రస్తావించారు. అక్కడ పండించిన తాజా ఆకుకూరలు, కూరగాయలను మధ్యాహ్న భోజనంలో ఉపయోగించడం వల్ల విద్యార్థులు ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉంటున్నారని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు మరియు హాజరు శాతాన్ని పెంచేందుకు గాను పలువురికి బహుమతులు అందజేశారు. ప్రీ–ప్రైమరీ నుండి 5వ తరగతి వరకు తరగతి వారీగా అత్యధిక మార్కులు పొందిన వారికి, అలాగే అత్యుత్తమ హాజరు కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక బ్యాడ్జీలను అలంకరించి అభినందించారు. చివరగా, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాల ప్రగతికి సహకరిస్తున్న దాతలకు సుదర్శన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠ శాల కమిటీ చైర్పర్సన్ సముద్రాల శ్రీలత, జడ్.పి.హెచ్.ఎస్ బీర్ పూర్ కాంప్లెక్స్ ప్రజల ఉపాధ్యాయులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ,ప్రధానో పాధ్యాయులు జూపాక సుదర్శన్, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి ,భోగ నాగరాణి, బాణావత్ స్వరూప ,బి .లలిత, జి.మౌనిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చివరి మజిలీ కోసం వైకుంఠ రథం విరాళం



**ముస్తాబాద్, ఫిబ్రవరి 21 ( ప్రజాజ్యోతి ):**

గ్రామ ప్రజలకు చివరి మజిలీ కార్యక్రమాల్లో సహాయపడాలనే ఉద్దేశంతో మన గ్రామానికి చెందిన గూడ సురేందర్ రెడ్డి , వారి తండ్రి కీర్తిశేషులు గూడ వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం, అలాగే కరెడ్ల తిరుమల్ రెడ్డి తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు కరెడ్ల గుండమ్మ, ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠ రథాన్ని (అంతిమ యాత్ర వాహనం) విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. రూ.2.50 లక్షల విలువ గల ఈ వైకుంఠ రథం తయారీ కోసం ఈ రోజు తయారీదారునికి విరాళం అందజేశారు. మరో నెల రోజుల్లో వైకుంఠ రథం గ్రామానికి అందుబాటులోకి రానుంది. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు స్మశానవాటిక దూరంగా ఉండడం వల్ల అంతిమ యాత్రకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించి, గ్రామ ప్రజలకు ఉపయుక్తంగా ఉండాలనే భావంతో ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొమ్మేనా ఆంజనేయులు మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యను అర్థం చేసుకుని వైకుంఠ రథాన్ని విరాళంగా అందిస్తున్న కుటుంబాలను అభినందించారు. గ్రామంలో అంతిమ సంస్కారాలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు వారు తీసుకున్న ఈ నిర్ణయం ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

# యువతకు స్వయం ఉపాధి శిక్షణలు

## ఆర్‌సెట్‌ఐ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):**

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గిస్తూ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే లక్ష్యంతో పెద్దపల్లి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెట్‌ఐ) 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సంస్థ డైరెక్టర్ రాకేష్ పరిష తెలిపారు. గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించి స్వంత ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా ఈ శిక్షణలు ఉపయోగపడనున్నాయని ఆయన పేర్కొన్నారు. మగ్గం పనులు, సృజనాత్మక ఆభరణాల తయారీ, సౌందర్య సంరక్షణ కేంద్ర నిర్వహణ, ఫోటోగ్రఫీ మరియు వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరా సేవల నిర్వహణ వంటి ఆధునిక, సంప్రదాయ రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అదనంగా కారు డ్రైవింగ్, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల నిర్వహణ, పాపడ్, ఊరగాయలు మరియు మసాలా పొడి తయారీ వంటి ఉపాధి ఆధారిత కోర్సులు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వర్గాల కోసం వికలాంగుల సాధికారత అభివృద్ధి కార్యక్రమం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం శిక్షణలు, బీసీ సఖి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణల ద్వారా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాపార ప్రణాళికల రూపకల్పనలో మార్గదర్శనం అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో సంస్థను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93922 21907 నంబర్‌ను కార్యాలయ సమయాల్లో సంప్రదించవచ్చని, గ్రామీణ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని డైరెక్టర్ రాకేష్ పరిష పిలుపునిచ్చారు.

# రాజ్యసభ ఎంపీల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), ఫిబ్రవరి 21:**



కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి తెలంగాణలో భర్తీ చేయనున్నా రాజ్యసభ సీట్లల్లో ఒకటి బీసీలకు ఇవ్వాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మెన్ కొండి సతీష్ డిమాండ్ చేశారు. రాష్టంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన వర్గాల వారికి సరైన న్యాయం చేయాలని, అధికారంలో ఉన్నా లేకున్నా అనునిత్యం కాంగ్రెస్ పార్టీకి నమ్మినబంటులాగా బీసీలకు చేదోడు వాదుడుగా ఉంటును బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీజీ ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ కి కేటాయించాలని ఏఐసీసీ పెద్దలను కోరారు. తెలంగాణ నుంచి భర్తీ చేసే రెండు రాజ్యసభ సీట్లలను, తెలంగాణ వారికే కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానంకి విజ్ఞప్తి చేశారు.

# పీఎం శ్రీ బొప్పాపూర్ పాఠశాలలో పేరెంట్స్ ఉపాధ్యాయులు సమావేశం

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ లోని పీఎం శ్రీ పాఠశాలలో శనివారము 10:30 కు పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సంయుక్తంగా పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ మీటింగ్ ను ప్రధానోపా ధ్యాయురాలు మధుమాలతి అధ్యక్షతన జరిగింది. పాఠశాలల్లోని మౌలిక వసతుల పైన విద్యార్థుల చదువు పైన ఉపస్థితి పైన క్రమశిక్షణ వంటి వాటిపైన ఆసక్తికరమైన చర్చను జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు సంపూర్ణ సమాధానాన్ని అందించారు.



# పేద ఆడబిడ్డ పెళ్లికి అండగా చారిటబుల్ ట్రస్టు



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి):**

పేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి చేయూతనందిస్తూ ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు మరోసారి తన సేవా భావాన్ని చాటుకుంది. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన వేలిచాల నిర్మల కీ.శే. గట్టయ్య గౌడ్ దంపతుల కుమార్తె ఐశ్వర్య వివాహానికి ట్రస్టు ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు ఏగోలపు సదయ్య గౌడ్ పెళ్లికూతురు ఐశ్వర్యకు బియ్యం మరియు పెళ్లి చీరను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం ట్రస్టు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి వెంకటేష్, వార్డు సభ్యుడు కోట రాజేశం గౌడ్, కొత్తూరి రాజయ్య గౌడ్, బొంగొని రాజు గౌడ్, కొత్తూరి కనకయ్య గౌడ్, మెట్టు లచ్చయ్య, తోటపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమిలో గుడి నిర్మాణం ఆపాలని లచ్చపేట తండా ప్రజల వినతి



**కోనరావుపేట: ఫిబ్రవరి.21(ప్రజా జ్యోతి)**

కోనరావుపేట మండలం గోవిందరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చపేట తండా ప్రజలు ప్రభుత్వ భూమి రక్షణకు ముందుకు వచ్చారు. గ్రామపంచాయతీ అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల్లో ఇప్పటికే జీపీ భవనం నిర్మించగా, మహిళా సంఘ భవనం పనులు కొనసాగుతున్నాయి. అయితే అదే భూమిలో కొందరు గుడి నిర్మాణం చేపట్టడంతో గ్రామంలో ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలంలో మతపరమైన నిర్మాణాలు చేపట్టకుండా తక్షణమే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వేములవాడ ఆర్డీఓకు వినతిపత్రం అందజేసి, భూమిని ప్రభుత్వ అవసరాలకే పరిమితం చేయాలని కోరారు.

# జోగినిపల్లి గ్రామంలో కత్తితో దాడి నిందితుడు అరెస్ట్

## పాత కక్షల నేపథ్యంలో గ్రామంలో కత్తితో దాడి ఘటన కలకలం రేపింది.

**కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

కోరుట్ల మండలంలోని జోగిన్ పల్లి గ్రామానికి చెందిన నల్ల నవీన్ తండ్రి గంగాధర్ (30) అదే గ్రామానికి చెందిన ముక్కెర గంగారెడ్డిపై ఒంటరిగా ఉన్న సమయంలో చేతులతో దాడి చేసినట్లు సమాచారం. రాత్రి సుమారు 9 గంటల సమయంలో కత్తితో గంగారెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో అతని ఇంటికి వెళ్లి గంగారెడ్డి ఇంట్లో లేకపోవడంతో, అతని తల్లి ముక్కెర వెంకటరాజు పై కత్తితో దాడి చేయగా, ఆమె తలకు, చేయికి, కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఆమెను వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితురాలి కుమారుడు ముక్కెర గంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఈ ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'రైటర్ల' రాజ్యం

సామాన్యుడి జేబుకు చిల్లు!
నిబంధనలు గాలికి
వసూళ్లే లక్ష్యం
నిజనిర్ధారణ ఎక్కడ?
సామాన్య గోడు పట్టదా?



**మల్యాల, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచేందుకు ఎన్ని చట్టాలు తెచ్చినా, టెక్నాలజీని వాడుతున్నా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం పాత పద్ధతులే రాజ్యమేలుతున్నాయి. "పైసా పీకో.. తమాషా దేకో" అన్న చందంగా అక్కడ వ్యవహారం నడుస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తుంటే, అంతా తామై డాక్యుమెంట్ రైటర్లు చక్రం తిప్పుతున్నారు.

## నిజ నిర్ధారణ ఎక్కడ?

చాలా చోట్ల భూమి యొక్క పూర్వాపరాలను, అది ప్రభుత్వ భూమా లేక వివాదాల్లో ఉందా? అన్న కనీస సోయి లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. నిజ నిర్ధారణ లోపం గ్రామ కంఠంలో గల భూమికి గృహ యాజమాన్య హక్కు పత్రం( ఓనర్ షిప్ సర్టిఫికెట్ ) ఉంటుంది. ఆ ఇల్లు గాని ఖాళీ స్థలాన్ని కానీ కొనుగోలు అమ్మకాలు జరగాలంటే గ్రామపంచాయతీలోని కార్యదర్శి పొజిషన్ మీదికి వచ్చి నిజనిర్ధారణ చేసిన తర్వాత లైసెన్స్ సర్వేర్ ద్వారా సర్వే చేపించి మ్యాప్ పై కార్యదర్శి ముద్రతో సంతకం చేసి నిజనిర్ధారణ చేయాల్సి ఉంటుంది. చుట్టుపక్కల ఉన్న వారి అభిప్రాయ సేకరణ తో పాటు నాలుగు దిక్కులు ఉన్నది ఎవరని ఆ ప్లానింగ్ పై ఖచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ సరైన పత్రాలు లేకపోయినా, రైటర్ల ఒత్తిడితో లేదా 'ముడుపుల' మత్తులో అధికారులు సంతకాలు చేసేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా మండలంలో జరిగిన ఓ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్యాల మండలంలోని ఓ గ్రామంలో ఒక ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తి పక్కింటి వారి స్థలంపై కన్నేశాడు. అమ్మిన వ్యక్తులు కొలిచి ఇచ్చిన భూమి కంటే తాను అదనంగా చేర్చుకొని సబ్ రిజిస్టర్ లో సబ్మిట్ చేయడం జరిగినట్లు సమాచారం. కేవలం ఓనర్ షిప్ సర్టిఫికెట్ చూసి ఆ ప్లాన్ పై గ్రామపంచాయతీ ముద్ర కార్యదర్శి, లైసెన్స్ సర్వేయర్ సంతకము లేకపోయినా సబ్ రిజిస్టర్ రిజిస్ట్రేషన్ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. తన భూమిని వేరొకరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విషయం తెలిసిన ఆ వ్యక్తి సబ్ రిజిస్టర్ ని ప్రశ్నించాడు. ఆ భూమి రిజిస్ట్రేషన్ అయిపోయినట్టు తానేమి చేయలేనని సబ్ రిజిస్టర్ సమాధానం ఇచ్చినట్టు బాధితుడు వాపోయాడు. భూమి కబ్జాలో ఉన్న వ్యక్తికి విషయం తెలిసిపోయిందని కోర్టుకు వెళ్లి తన భూమిని ఒక వ్యక్తి కబ్జా చేశాడని భూమి యజమానికె కోర్టు నోటీసులు పంపించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. కోర్టుకు వరకు వెళ్లిన అంశం కాబట్టి ఊరిలోని పెద్ద మనుషులు, పోలీసు వారు కలగజేసుకొనే పరిస్థితి లేకపోవడంతో బాధితుడు ఒక లాయర్ ను ఆశ్రయించినట్లు సమాచారం. ఆ లాయర్ రీ సూట్ వేయాలని దానికి కొంత ఖర్చు అవుతుందని చెప్పడంతో బీద కుటుంబం కావడం ఆర్థికంగా లేకపోవడంతో తాను ఏం చేయాలో అర్థం కాక బాధితుడు బాధపడుతున్న తీరు గ్రామంలో పలువురిని కలిసి వేస్తుంది. ఆ డాక్యుమెంట్ తయారు చేసిన డాక్యుమెంట్ రైటర్ ఎవరు? ఆ భూమిని కొలత తీసిన లైసెన్స్ సర్వేర్ ఎవరు? ఆ మ్యాప్ పై గ్రామపంచాయతీ కార్యదర్శి ముద్ర సంతకము ఎందుకు లేవు? అనే అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. డబుల్ రిజిస్ట్రేషన్లు ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేస్తున్న ఘటనలు నిత్యకృత్యమ య్యాయి. దీనివల్ల కొనుగోలుదారులు లక్షల రూపాయలు పోగొట్టుకుని కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి. ఈ ఘటనలు అంతులేని ప్రశ్నలుగా మిగిలిపోయి సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. నష్టపోయిన బాధితుడిని ఎలా ఆదుకుంటారో? తాను నష్టపోకుండా తనకు న్యాయం ఎలా చేస్తారో? రిజిస్ట్రేషన్ అధికారులకే తెలియాలి.

## నిబంధనలు గాలికి.. వసూళ్లే లక్ష్యం!



ప్రభుత్వ నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లలో లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. డాక్యుమెంట్ రైటర్లు ఇచ్చే 'గ్రీన్ సిగ్నల్' కోసమే అధికారులు వేచి చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ ఫీజుతో సంబంధం లేకుండా, టేబుల్ కింద ఇచ్చే "అదనపు వసూళ్ల" పంపకాల్లో రైటర్లే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ యథేచ్ఛగా దందాను సాగిస్తున్నారు.

## సామాన్యుల గోడు పట్టదా?

కష్టపడి సంపాదించిన డబ్బుతో చిన్న స్థలం కొనుక్కుందామనే సామాన్యుడికి ఈ 'సిండికేట్' పెద్ద శాపంగా మారింది. రైటర్లు అడిగినంత ఇచ్చుకోకపోతే, ఫైళ్లలో కొర్రీలు పెట్టడం.. స్లాట్ దొరకకుండా చేయడం వంటి పద్ధతులతో వేధిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టాలని, డాక్యుమెంట్ రైటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసి సామాన్యులకు ఊరట నివ్వాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రమాదకరంగా కరెంటు పోల్,



**శంకరపట్నం, ఫిబ్రవరి 21(ప్రజా జ్యోతి)**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్డు నుండి వీణవంక ఆర్ అండ్ బి రోడ్డు పక్కన కరెంటు పోల్ ప్రమాదకరంగా ఉంది రోడ్డుపై నుంచి సుమారు 600 వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి కరెంటు పోల్ తొలగించుకోవడంతో వాహనదారులు భయాందోళనలో చెందుతున్నారు అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# మాతృభాష దినోత్సవం

**గంభీరావుపేట ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):**

గంభీరావుపేట మండలం లింగన్న పేట గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మాతృభాష యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ తెలుగు పాఠ్యాంశాల పై చక్కని క్విజ్ ను ఏర్పాటు చేసి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎస్. గంగారాం , తెలుగు ఉపాధ్యాదయులు మం.నరేందర్,కె రాజయ్య లు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.